# జీవాత్మ, పరమాత్మల ఏకత్వమును బోధించునదే నామతత్త్వము

వానలు వచ్చినంతనె భువి పండునే విత్తులు నాటకున్న ఆ
వానలు రానిచో ఫలము వచ్చునె బీజము నాటియున్న నెం
దైనను రెండు కూడిన మహత్తర సిద్ధి లభించునమ్మి దై
వాను గతిన్ లభించు పురుషార్థ విధానము మేలునిచ్చుటన్.

మనసులోనున్న భావంబు మంచిదైన
కలిగి తీరును ఫలసిద్ధి కార్యమందు
మనసులోనున్న భావంబు మలినమైన
ఫలముకూడను నారీతి మలినమౌను.

ప్రేమస్వరూపులారా!

సమస్త ప్రపంచమునకు ఆధారము అగ్ని, సూర్యుడు, చంద్రుడు. ఈ మూడింటిని లేదనికాని, కాదనికాని ఎవ్వరునూ చెప్పలేరు. "కృశాను భాను హిమదర్యా", కృశాను అనగా అగ్ని, భానుడు అనగా సూర్యుడు, హిమము అనగా చంద్రుడు. ఈ మూడింటియొక్క చేరికచేతనే యావత్ ప్రపంచముకూడను మానవులను ఆకర్షించుచున్నది, రమింపచేయుచున్నది, భ్రమింపచేయుచున్నది, తరింపచేయుచున్నది. జగత్తును రమింప చేయునవి కనుకనే యీ మూడింటికిని "రామ" అని పేరు. 'రామ' అను పదమునందు మూడు శబ్దములు యిమిడి వుంటున్నవి. ర, అ, మ-యిది రామ. ర-అగ్ని, అ-సూర్యుడు, మ-చంద్రుడు. ఈ మూడింటియొక్క సమ్మిళిత స్వరూపమే రామతత్త్వము.

srisathyasaivachanamrutam

ప్రపంచమునందు సమస్త పదార్థములుకూడ రూపనామములు తప్ప వేరొకటి లేదు. సమస్త పదార్థములు నామము నాశ్రయించియే వున్నవి. నామమునాధారం చేసుకొనియే రూపమును మనం పొందగల్గుతున్నాము. కనుక, జగత్తునకు నామమే ప్రధానము. నామమే ఆధారము. నామమే మూలము. ఈ ప్రపంచమంతయు రెండు పదార్థముల సంయోగముచేతను, ఇద్దరు మానవుల సంయోగముచేతను, రెండు విషయముల సంయోగముచేతను ఏర్పడుతున్నది.

### రమింపజేసే తత్త్వమునకే 'రామ' అని పేరు

మానవులయొక్క సంయోగముచేతనే జీవతత్వం ఏర్పడుతున్నది. నైతికంగా, ధార్మికంగా, ఆధ్యాత్మికంగా, వైజ్ఞానికంగాకూడా యిది కాదని ఎవరూ చెప్పలేరు. వైజ్ఞానికంగాకూడా యీ రెండింటియొక్క సంయోగమే జననమునకు మూలకారణము అని నిరూపిస్తున్నది. భగవత్ నామము అనేది మహాశక్తివంతమైనది. కామధేనువైనా మెడకు పలుపు త్రాడు కట్టి ఒక గూటమునకు బిగించినపుడు, బంధింపబడి మన వశమవుతుంది. అటులనే సర్వాభీష్టములను నెరవేర్చునటువంటి, సర్వ హృదయవాసి అయిన, సర్వాంతర్యామి అయిన భగవంతుడనే కామధేనువును భక్తి అనే పాశముచేత కట్టి నాలుక అనే గూటమునకు బిగించినపుడు వశీభూతుడవుతాడు. భగవంతుడిని బంధించుటకు, వశం చేసుకోవటానికి, ఆనందంగా అనుభవించటానికి, రెండే మార్గములు. ఒకటి నామము, రెండవది భక్తి. యీ నామము అనేది కేవలం 'రామ' అని పిలువవచ్చు. 'హరి' అని పిలువవచ్చు. 'హర' అని పిలువవచ్చు. ఇంకే విధమైన నామముచేతనైనా సర్వాంతర్యామియైన భగవంతుని పిలువవచ్చు. ఈ 'రామ' అనే పదము కేవలం దశరథ మహారాజుయొక్క కుమారుని పేరు మాత్రమే కాదు. రమింపచేసే ఆత్మకే 'రామ' అని పేరు. ఈ నామము దశరథకుమారునికి వశిష్టులవారు పెట్టినటువంటి పేరు. అంతే కాని 'రామ' అంటే కేవలం దశరథ మహారాజుయొక్క కుమారుని పేరు మాత్రమే కాదు. సర్వతత్త్వము, సర్వవ్యాపకత్వము, సర్వ ఈశ్వరత్వము, సర్వాంతర్యామియొక్క తత్వమే యీ 'రామ' అనే పేరునకు సరియైన అర్థము.

sri sathyasai vachanamrutam

### నామముయొక్క ప్రభావముచేత విషముకూడా అమృతంగా మారిపోతుంది

ప్రాచేతసుడు, అనగా వాల్మీకి నూరు కోట్ల శ్లోకములుగల రామాయణమును రచించాడు. ఈ శ్లోకములను ముల్లోకవాసులకు సమముగా పంచవలెనని భగవంతుడిని ప్రార్థించాడు. ఆ భక్తుని అభీష్టమును పురస్కరించుకొని ఈశ్వరుడు ఒక్కొక్క లోకమునకు 33 కోట్ల 33 వేల 33 వందల 33 శ్లోకములుగా విభజించాడు. ఈ విధముగా 100 కోట్ల శ్లోకములను పంచినపుడు ఒక్క శ్లోకము మిగిలింది. ఈ శ్లోకములో 32 అక్షరములుంటున్నాయి. ఈ శ్లోకమునుకూడను ముల్లోకవాసులకు సమంగా పంచాలని దశాక్షరీ నామమును 10 అక్షరములుచొప్పున ముల్లోకములకు పంచాడు. ఇక రెండు అక్షరములు మాత్రమే మిగిలివున్నవి. ఈ రెండు అక్షరముల నామములే 'రామ', 'హరి', 'హర', 'కృష్ణ', 'సాయి' అనే రూపంలో ఏర్పడుతూ వచ్చాయి. దీనిని ఏ లోకవాసులైనా స్మరించవచ్చును. ఏ దేశీయులైన స్మరించవచ్చు. ఏ వ్యక్తులైనా స్మరించవచ్చు. ఇది ఏ ఒక్క తెగకు, ఏ ఒక్క మతమునకు, ఏ ఒక్క కులమునకు సంబంధించినదికాదు. హృదయముకల మానవుడు, ప్రేమకల మానవుడు, ఈ పవిత్ర నామమును స్మరించుటలో ఏమాత్రం దోషంలేదు. నామముయొక్క ప్రభావంచేత విషముకూడా అమృతంగా మారిపోతుంది.

పవిత్రమైన చరిత్రలయందు మీరా చరిత్రకూడా మీరు చదివి వుండవచ్చును. ఆమె మహారాణి. ఆమె అహంకారంకాని, అభిమానంకాని, భేదభావంకాని లేకుండా ఎంతటి మగవారిమధ్యనైనను, ఎందరు రాజులమధ్యనైనా కృష్ణుని ప్రార్థనచేసుకుంటూ గానంచేసుకుంటూ ప్రార్థనలో మైమరచి ఉండేది. దేహాభిమానం కల ఆమె మరిది, రాణియైన మీరా పరపురుషులమధ్య చేరి యింత విచ్చలవిడిగా పాడుతూ యీ విధమైన స్వేచ్ఛను అనుభవిస్తున్నదని అతనిలో ద్వేషం ఏర్పడింది. సర్వాభిమానమును త్యజించినటువంటిది, మీరా! సర్వాభిమానములతో కూడినవాడు, మరిది. భక్తికి అభిమానం ఏమిటి? మమకారం ఏమిటి? భగవత్ ధ్యానంలో మునిగిన వ్యక్తికి అభిమాన, మమకారము లేమాత్రం వుండకూడదు. అట్టి పవిత్రతత్వమును గుర్తించుకోలేని మరిది తన రాజ్యమునకు, జాతికి, కులమునకు అవమానం కల్గించుచున్నదని, అటువంటి స్త్రీ జీవించి

srisathyasaivachanamrutam

వుండకూడదని పాలలో విషం కలిపి ఆమెకందించాడు. శ్రీకృష్ణపరమాత్మకు తన హృదయమునే అర్పించిన మీరాకు తను పుచ్చుకునే సమస్త పదార్థములుకూడా కృష్ణునికి అర్పితము చేసి ప్రసాదముగా తాను స్వీకరించటం అలవాటు. ఈ క్షీరమును కృష్ణునికి అర్పితం చేస్తున్నప్పుడు ఆ క్షీరములోనున్న విషమునంతా కృష్ణుడు తనలో చేర్చుకొని పరిశుద్ధమైన క్షీరమునంతా మీరా కందించాడు. పవిత్రమైన భక్తి ప్రపత్తులలో వుండిన మహత్తరమైన శక్తిని జగత్తునకు చాటే నిమిత్తము నామమునందు వున్న దివ్య తేజస్సును, ప్రభావమును ప్రజలకు బోధించే నిమిత్తము, యీ విధమైన ఆదర్శము మీరా అందిస్తూ వచ్చింది. ఈ నామము ఎక్కడినుంచి వచ్చినది? ఎక్కడ చేరినది? ఎక్కడ ఉచ్చరింపబడుచున్నది? అనే తత్వాన్ని మానవులెవరూ గుర్తించడానికి ప్రయత్నించటంలేదు. దీనికాధారము, ఆదర్శము, భాగవతమే!

బలరామకృష్ణులు ఎక్కడ పుట్టారో యశోదకు తెలీదు. కాని, తన కుమారులనే భావించి యశోద వారిని సాకుతూ వచ్చింది. వీరిరువురూ గోకులములో నివసిస్తూ వచ్చారు. మథురలో పుట్టారు. దేవకీదేవి గర్భములో పుట్టారు. యశోద యింటిలో ఆటలాడుకున్నారు. ఇక్కడ యశోద ఎవరు? గోకులము ఏది? మథుర ఏది? దేవకీదేవి ఎవరు? ఈ అన్నింటియొక్క అంతరార్థమును చక్కగా గుర్తించటానికి ప్రయత్నించినపుడు యిది పవిత్రమైన, దివ్యమైన చరిత్రగా రూపొందుతూ వచ్చింది. మథుర అనగా ఏమిటి? నాభిస్థానమే మథుర. దివ్యశక్తియే దేవకీదేవి. నాదము అనే దేవకీదేవియందు ఉద్భవించి యశోద అనే నాలుకపైన పెరుగుతూ వచ్చారు. నాలుకయే యశోద. నోరే గోకులము. నాభియే మథుర. దివ్యశక్తియే దేవకీదేవి. పవిత్రమైన నామములే బలరామకృష్ణులు.

**నామస్మరణ అనేది నాభినుండి ఆవిర్భవించి నాలుకపైన నాట్యమాడినప్పుడే అది పవిత్రమైన నామంగా రూపొందుతుంది**

'రామ' అనేది రమించేటువంటిది. ఏవిధంగా రమించేటువంటిది? మహాబలవత్తరంగా రమించేటువంటిది. నాలుకనుండి బయల్వెడలే ఆ నామమును మనం కాపాడుకోవాలి. కాని, స్మరణమాత్రం నాభినుండి రావాలి. కనుక, నామస్మరణ అనేది నాభినుండి

sri sathyasai vahini amrutam

ఆవిర్భవించి, నాలుకపైన నాట్యమాడినపుడే అది పవిత్రమైన నామంగా రూపొందుతుంది. నామము అనే దానికి అర్థం ఏమిటి? నామ-న, అ, మ. సంఖ్యాశాస్త్రమునందుకూడను యిది ఏడుగా రూపొందుతుంది. 'న' అనగా 0, 'అ' అనేటువంటిది 2 సంఖ్య అని, 'మ' అనేటువంటిది 5 సంఖ్య అని. 0+2+5=7. కనుకనే, యీ ఏడింటికీ సప్తస్వరములని పేరు పెట్టారు. జగత్తంతాకూడా సంగీతమునందుకూడా 'స,రి,గ,మ,ప,ద,ని' యివే ఏడు శబ్దములు. ఇదే సప్తస్వరములు. సూర్యునియందున్నది, సప్తరంగులు. ప్రపంచమునందున్నది, సప్త సముద్రములు. దివ్యజ్ఞాన స్వరూపులైన ఋషులు సప్తఋషులు. కనుక, నామము అనగా సప్త ఋషులయొక్క సంబంధము. కనుకనే యీ నామమును చేసేవారు 'సప్తాహము' అంటుంటారు. 7 దినములు చేయాలి అని.

నామతత్వాన్ని యింకొక రీతిగా మనం విచారణ చేసినపుడు, మానవుని మనో గమనము. ఈ గమనముపైన మధుకరమనే తుమ్మెద వచ్చి వాలుతుంది. మనసునందున్న మధురమైన భావాన్ని గ్రోలేది యీ మధుకరము. దీనిని మరొకరీతిగా 'మధు', 'కర' అనే రెండు పదములుగా విభజించినపుడు 'మధు' అనగా 'జలము', 'కర' అనగా 'సూర్యప్రకాశము'. కమలము క్రింద జలము, పైన సూర్యకిరణము. రెండూ వుండినపుడే జీవించగలుగుతుంది. కనుక, మన మనో కమలమును సంరక్షించేది, మధుకరము. ఈ సూర్య కిరణములు క్రిందవున్న జలమును పైకి తీసుకుని, మళ్ళీ క్రిందకి పంపుతుంటాయి. అనగా, మనస్సునకు 'పునరపి జననం, పునరపి మరణము.' పంపటం, తీసుకోవటం-తీసుకోవటం, పంపటం. అయితే యీ రెండింటియొక్క ఏకత్వము కూడినపుడు యిదే రామతత్త్వంగా మారిపోతుంది. మధుకర-యిదే రామ. వేదాంతతత్త్వమునందు 'తత్త్వమసి' అన్నారు. 'తత్' అనగా పరమేశ్వరుడు. 'త్వం' అనగా జీవుడు. ఈ రెండింటినీ కలుపునదే 'అసి'. కనుక, ర, అ, మ- ర అనగా పరమాత్మతత్త్వం, మ-అనగా జీవాత్మతత్వం. ఈ రెండింటినీ ఏకం చేయునదే. 'అ' అనే కూడిక. అదే 'అసి'. కనుక 'తత్త్వమసి'-ఈ జీవాత్మ, పరమాత్మల ఏకత్వమును బోధించునదే నామతత్త్వము.

**విత్తనమునందు మహావృక్షమేరీతిగా ఇమిడియున్నదో అదే రీతిగా ఒక్క నామమునందే**

sri sathyasai vachanamrutam

## సమస్త ప్రపంచము ఇమిడియున్నది

దీనికి మరొక చరిత్రకూడా వున్నది. ఒకానొక సమయంలో ఈశ్వరుడు గణనాథుడిని ఒకరిని నియమించాలని నిర్ణయించుకున్నాడు. గణములనగా దేవతలు. దేవతలందరికీ ఒక నాయకుడుండాలి. ఏదానికైనా ఒక నాయకుడు లేనిదే నాటకమే జరగదు. కనుక, ఒక నాయకుడిని నియమించాలని సంకల్పించుకున్నాడు. దేవతలనందరినీ సమావేశపరచి ఎవరు మీలో ముందుగా భూప్రదక్షిణ చేసుకుని వస్తారో వారికి గణాధిపత్యం అందిస్తానన్నాడు. వెంటనే దేవతలు ఎవరెవరి వాహనాలని వారు ఎక్కి భూప్రదక్షిణ ప్రారంభం చేశారు. ఇందులో గణపతికూడా ఒకడు. ఇతన్ని 'లంబోదరుడు' అని పిలుస్తూ వచ్చారు. మొదట 'గణపతి' అని పేరు లేదు. 'లంబోదరా, లంబోదరా' అని పిల్చేవారు. అతనికి పొట్ట పెద్దది. వాహనం చిన్నది. దానిపైన కూర్చుని భూప్రదక్షిణ ప్రారంభించాడు. మధ్యమార్గంలో నారదుడు ఎదురయి, 'లంబోదరా! ఎక్కడికి వెళ్తున్నావ'ని ప్రశ్నించాడు. ఈ లంబోదరునికి కోపం వచ్చింది. 'నేను యీ చిన్న వాహనాన్ని ఎక్కి భూప్రదక్షిణకు పోతున్న సమయంలో ఒంటి బ్రాహ్మణుడు ఎదురు వచ్చాడు. పోనీ అదొక అపశకునమనుకుంటే ఎక్కడికి వెళ్తున్నావని ప్రశ్నించాడు. ఇది మరొక అపశకునం. కనుక, నా కార్యము పూర్తిగా భిన్నంగా జరిగి పోతుంది, అనుకూలం కాద'ని విశ్వసించుకున్నాడు. తండ్రియాజ్ఞను నేను నెరవేర్చ లేకపోతాననుకున్నాడు. చాలా విచారపడిపోయాడు. అప్పుడు నారదుడు మరింత దగ్గరకొచ్చి నవ్వుతూ 'లంబోదరా! నీ ప్రయాణం నాకు తెలియనిది కాదు. పోతున్నావు కాని, 'శృతి ప్రయాణం' నీవు అనుసరించినపుడే నీకు విజయం కల్గుతుంది,' అన్నాడు. ఈ 'శృతి ప్రయాణం' ఏమిటి? సర్వశృతులయందు దివ్యమైన నామతత్త్వమే బోధింపబడింది. ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములందు నామమే ప్రధానము, నామమే మూలముగా చెప్పబడింది. ఒక్క మర్రి విత్తనమునందు గొప్ప వృక్షమేరీతిగా యిమిడివున్నదో, ఒక్క నామమునందే సమస్త ప్రపంచంకూడా యిమిడి వుంటుంది. కనుక, ప్రపంచం వేరు, నామము వేరు కాదు. 'నీవు నామానికి ప్రదక్షిణ చేస్తే ప్రపంచానికే ప్రదక్షిణ చేసినవాడవు అవుతావు,' అన్నాడు. 'ఒకవేళ దేవతలు దీనిని అంగీకరించకపోతారేమో, నేనే దీనికి సాక్షి,' అన్నాడు. 'నేను విట్‌నెస్‌గా వస్తాన'న్నాడు. 'సరే! నారదా! ఆ నామమేమిటి చెప్పుమ'న్నాడు. 'నేను చెప్పినట్లుగా

sri sathyasaivachanamrutam

చేసేటట్లయితే ఆ నామం నీకు చెప్తాన'న్నాడు. 'తప్పక శిరసావహిస్తా'నన్నాడు, గణపతి. 'రామ' అని వ్రాసి దానిని చుట్టి తిరిగి వెనుకకు వెళ్ళాడు. ఈ ప్రపంచమంతా రమించునది యీయొక్క నామమే! ప్రపంచమంతా యీ నామమునందే యిమిడి వుంటున్నది. కనుక, 'నామ ప్రదక్షిణే ప్రపంచ ప్రదక్షిణ' అన్నాడు. ఈ విధంగా నారదుని ఉపదేశమును పురస్కరించుకుని దాని ననుసరించి తిరిగి వెనుకకు వెళ్లాడు. ఈ మహత్తరమైన అంతరార్థమును గుర్తించినవాళ్లు అవుటచేత ఆనాటినుండి లంబోదరునకు 'గణపతి' అని పేరు పెట్టారు.

అన్ని గణములకు పతి అయినవాడు కనుక యితనికి 'గణపతి' అని పేరు పెట్టారు. 'ఏ కార్యం ప్రారంభించినప్పటికీ, ఏ దేవతా పూజలు ప్రారంభించినప్పటికీ, దేవతలు అందరికీ అధిపతివి కనుక మొదట నీ పూజ జరుగుగాక!' అని తండ్రి ఆశీర్వదించాడు. ఏ శుభకార్యములు మనం ప్రారంభించినప్పటికీ గణపతి పూజ చేయటంలో అంతరార్థం యిదే! 'సిద్ధ గణపతి, బుద్ధి గణపతి' అని మరొక పేరు. సిద్ధి, బుద్ధి అతనియొక్క శక్తులు. ఇలాంటి శక్తిసామర్థ్యములు కల్గినవాడు కనుక సమస్త కార్యములకు ఏ విఘ్నములు కల్గకుండా అవిఘ్నం గావించేవాడు విఘ్నేశ్వరుడు. ఈ ఆధిపత్యం దేనినుండి యితనికి లభించింది? నామమునుండియే లభించింది.

**ఆధారములేని ఆధేయము ఉండటానికి వీలు లేదు**

ఈ నామము ఎంత మహత్తరమైనదో మీరు చక్కగా విచారించవచ్చు. నామములో అగ్ని, సూర్యచంద్రాదులు నివసిస్తారు. వైజ్ఞానికంగాకూడా ఆలోచిస్తే కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో వున్న సూర్యుడే మాడ్చి భస్మం గావిస్తున్నాడీ జగత్తును. ఇలాంటి సూర్యుడిని కన్నటువంటి తల్లి ఎవరు? తండ్రి ఎవరు? ఇక వారెంత శక్తిసామర్థ్యములు కల్గినటువంటివారుగా వుండాలి? ఎంతో తేజోవంతులుగా వుండాలి? ఇంక అగ్ని, అగ్ని తగిలిన తక్షణమే మనలను భస్మం చేస్తుంది. ఈ అగ్నిని కన్నటువంటి తల్లి ఎవరు? తండ్రి ఎవరు? ఈ ఇరువురి సంయోగంచేతనే కదా సంభవిస్తుంది! ఇంక చంద్రునికి శీతరాశి అని పేరు. అతను ఎన్నో లక్షల మైళ్ళ దూరంలో వున్నప్పుడే మనకెంతో చల్లగా హాయిగా వుంటుంది. అతన్ని సమీపించినపుడు చల్లగా మంచుగడ్డవలె మనం తయారవుతాము.

srisathyasaivachanamrutam

ఇతన్ని కన్న తల్లి యింకెంత మంచుగడ్డలా వుంటుంది? తండ్రి ఎంత చల్లనివానిగా వుంటూ వుండాలి? ఇవన్నీ మనం చక్కగా విచారణ చేస్తే, తేజోవంతుడు, విజ్ఞానవంతుడు, ప్రజ్ఞానవంతుడూ, చల్లని హృదయంకలవాడు భగవంతుడు. కనుక, యీ మూడింటికీ తల్లీతండ్రీ భగవంతుడే! సమస్తమూ భగవంతునినుండియే ఆవిర్భవించింది. కాని, సామాన్య మానవులు ప్రాకృత సంబంధమైన పదార్థములయొక్క విచారణ సల్పుతూ పోతున్నారేకాని, సమస్త పదార్థములకు మూలాధారమైన శక్తిని విచారించటానికి ప్రయత్నించటంలేదు. ఆధారములేని ఆధేయం వుండటానికి వీల్లేదు. ఈనాడు సైంటిస్టులుకూడా ఏదో ఒక ఆధారమున్నది అని ప్రయత్నపూర్వకంగా తెల్సుకోగల్గుతున్నారు. దేనికయినా ఒక ఆధారముండే తీరాలి. ఈ కప్పు యిక్కడ నిలచి వుందంటే దీనికి యీ టేబిల్ ఆధారంగా వుంది. ఈ స్టేజికి భూమి ఆధారం. ఇలా ఒక దానికొకటి ఆధారం, ఆధారం. యీ ఆధారం లేకపోతే ఆధేయం వుండటానికి వీలుకాదు. ఆధారమే నామము. ఆధేయమే లోకము. కనుక, సమస్త ప్రపంచంకూడా నామముపైన ఆధారపడి వున్నది. ఈ నామముచేత ఎంత కఠినమయినా ఎలాంటి సంధిగ్ధావస్థలో వున్న రూపాన్ని అయినా మనం చేపట్టవచ్చు. ఈ కొద్దిమంది ప్రజలలో కొన్ని గుర్తులు చెప్పి గుర్తుపట్టమంటే చాలా కష్టం అవుతుంది. రూపాన్ని బట్టి అతన్ని పట్టడానికి చాలా కష్టం అవుతుంది. ఒక నామం ప్రధానం చేసుకుంటే, ఫలాని రామయ్య ఫలానా కృష్ణయ్య అంటే యింతమందిలో అతను లేచి నిల్చుంటాడు. నామం సులభంగా పడుతుంది, కాని రూపాన్ని పట్టటం చాలా కష్టం. అదే విధముగనే, భగవంతుడిని మనం ఆశ్రయించుకోవాలని అనుకున్నప్పుడు, భగవంతుడిని మనం చింతించాలి అనుకున్నప్పుడు, భగవంతుడిని మనం స్వాధీనం చేసుకోవాలని అనుకున్నప్పుడు, అతని నామమే అతని రూపానికి తగినటువంటి మార్గం. ఈ నామం నిరంతరం మంగళకరమైనటువంటి నామము.

**దైవభావము తప్ప వేరు భావములేక దైవచింతన చేసినదే జాగరణ**

ప్రపంచంలో ప్రతీ మానవుడుకూడను మూడు రకములయిన రాత్రులను గడుపుతున్నాడు. ఒకటి వెన్నెల రాత్రి, రెండవది చీకటి రాత్రి, మూడవది చీకటి, వెన్నెల

sri sathyasai vachanamrutam

కలసిన రాత్రి. ప్రతీ మానవుడుకూడను యీ మూడు రకములైన రాత్రులను అనుభవిస్తున్నాడు. కాని వీటన్నింటికంటే పవిత్రమైన, విలక్షణమైన రాత్రి మరొకటి వుంది. అదే శివరాత్రి. అనగా 'మంగళకరమైన నామంతో గడిపినటువంటి రాత్రే శివరాత్రి' అని. అనగా రాత్రి అంతయు మంగళకరమైన నామంచేతనే గడుపుకోవాలి. కలి ప్రభావంచేత యీనాడు శివరాత్రినాడు ఏదో ఒక విధమైన జాగరణ చేయాలని మూడు సినిమాలకు పోయి జాగరణ చేస్తారు. పేకాటలాడుకుంటూ జాగరణ చేస్తారు. డ్రామాలు చూసుకుంటూ చేస్తారు. కాదు అది శివరాత్రి కాదు.

**పేకాటనాడుచు ప్రీతితో నారాత్రి**
**గడిపినందులకె జాగరణమగునె**
**చేపలకొరకునై చెరువులో జాలర్లు**
**పొంచి చూచెడు దృష్టి ముక్తికగునె**
**తప్పసారాత్రాగి తన మేను మరచిన**
**మాత్రాన పరమ తన్మయతనగునె**
**భార్యపై నల్గియు పస్తు పరుండిన**
**వాడెల్ల నొకనుపవాసి యగునె**
**తలపు నీయందె యుంచిన కలదుగాని**
**భక్తి సుంతైన లేనిదే ముక్తి కలదె!**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!**

ఇవన్నీ ఉపవాసం కాదు, జాగరణలు కావు, ధ్యానము అంతకంటే కాదు. ఏది జాగరణ? క్షణక్షణంకూడా దైవభావంతప్ప వేరుభావం లేక దైవచింతన చేసినదే జాగరణ. కనుక, యిదే శివరాత్రి. శివమనగా మంగళకరం.

**రూప, నామములు వేరైనా దివ్యతం ఒక్కటే!**

భగవంతునికి అనేక పేర్లున్నాయి. హరికి, హరునకు ఎట్టి భేదం లేదు. వైష్ణవులు,

sri sathyasaivachanamrutam

శైవులు అని మానవులు కేవలం సంకుచిత భావంతో ఏర్పరుచుకున్నారే కాని, భగవంతునికలాంటి భేదములే లేవు. భగవంతుడు ఒక్కడే! అనేక నామములు, రూపములు వుండవచ్చు. కాని దివ్యత్వం ఒక్కటే! చాలామంది వైష్ణవులు తిరుపతికి వెళ్తుంటారు. 'ఓ వెంకటరమణా!' అంటారు. రమణ అనగా వైష్ణవుడు, వాళ్లు మూడు నామములు పెట్టేటువంటివారు. శైవులు వెళ్తారు. 'వెంకటేశ్వరా!' అంటారు. వాళ్ళకి 'ఈశ్వరా' అంటే అదొక తృప్తి. వీళ్ళ మూడు నామములు నిల్చుంటే, వాళ్ల మూడు నామములు పండుకుంటాయి. అదే వ్యత్యాసం. కాని, వున్న వెంకటేశ్వరుడొక్కడే! 'వెంకటరమణా' అన్నా, 'వెంకటేశ్వరా' అన్నా ఒక్కడే! ఇంతేగాకుండా వైష్ణవులు విష్ణుమూర్తికి శంఖము, చక్రము, గద, పద్మము నాల్గు హస్తములతో వుండాలని భావిస్తారు. శంఖమనగా శబ్దము. సమస్త శబ్దముకూడా భగవంతుని హస్తములో వుండాలి. ఇంక చక్రమనగా కాలము. ఈ కాలంకూడా భగవంతునియొక్క హస్తములోనే వుండాలి. పద్మము అనగా హృదయము. సర్వుల హృదయములుకూడా భగవంతునియొక్క హస్తములోనే వున్నాయి. 'గద' అనగా బలము. ఈ సర్వబలములుకూడా భగవంతుని హస్తమునందే వున్నవి. ఇదే విష్ణువుయొక్క అంగములకు, విష్ణువుయొక్క ఆయుధములలో వున్న అంతరార్థము. ఇంక ఈశ్వరునకు ఒక చేతిలో ఢమరుకము. ఢమరుకము శబ్దమునకు సంకేతము. ఒక చేతిలో త్రిశూలము. ఈ త్రిశూలమనగా ఏమిటి? భూత, వర్తమాన, భవిష్యత్‌లు. గడచిపోయినది, వున్నది, రాబోయేటటువంటిది. కాలముయొక్క స్వరూపం కాబట్టి, ఈశ్వరుని చేతిలోకూడా శబ్దము, కాలము వుంటున్నాయి. ఈ విధంగా భగవంతుని తత్త్వం విచారించినపుడు ఏ దేవతయందైనా వున్న సర్వ శక్తులూ ఒక్కటే! కనుకనే భగవంతుడిని 'శబ్దబ్రహ్మమయీ, చరాచరమయీ, జ్యోతిర్మయీ, వాఙ్మయీ, నిత్యానందమయీ, పరాత్పరమయీ, మాయామయీ, శ్రీమయీ' అని వర్ణిస్తారు. ఇవి భగవంతునియొక్క నామములు. ఇట్టి నామము నాధారం చేసుకుని భేదములను నిర్మూలంచేసి భగవంతుని స్మరించి, జన్మను సార్థకం గావించుకొమ్మని యిలాంటి పవిత్ర పర్వదినములు భారతీయుల కేర్పడుతూ వచ్చినవి.

**మనోబుద్ధులు రెండూ ఆత్మయొక్క ప్రకాశములేగాని దేహమునకు సంబంధించినవి కావు**



srisathyasaivachanamrutam

దివ్యాత్మస్వరూపులారా! సర్వులయందు నివాసం చేసే దైవం ఒక్కడే! అతని పేరే 'హృదయవాసి.' హృదయమునకు, మనస్సునకు వున్న వ్యత్యాసం యోచించాలి. హృదయమనగా 'గుండె' అంటారు. ఈ గుండె దేహమునకు సంబంధించినది. ఈ గుండె రక్తమును పరిశుద్ధపరచి దేహమంతా వ్యాపింప చేస్తుంది. కాని మనసు దేహానికి సంబంధించినది కాదు. మనసు దేహములో లేదు. దేహమున కతీతమై వుండేదే మనస్సు. కనుకనే, 'మనో మూల మిదం జగత్'. జగత్తంతా వ్యాపించివున్నది. దేహానికి సంబంధించినది కాదు. ఈ గుండె అనేది కేవలం దేహానికి మాత్రమే సంబంధించినది. తదుపరి 'బుద్ధి,' 'మేథస్సు' అని రెండు పదములుంటున్నాయి. 'మేథస్సు' అనగా సర్వేంద్రియములను అరికట్టేటువంటిది. అయితే, 'బుద్ధి' దేహానికి సంబంధించినది కాదు. ఈ మేథస్సు యింద్రియములతో కూడినది. కనుకనే, 'బుద్ధి గ్రాహ్యమతీంద్రియం" అన్నారు. ఈ యింద్రియముల కతీతమైనది బుద్ధి. నా బుద్ధి ఏమో చేస్తున్నదని తలను చూపుతారు. దేహంలో లేదు, బుద్ధి. దేహానికి అతీతం అయినది బుద్ధి. మనో బుద్ధులు రెండూకూడా ఆత్మయొక్క ప్రకాశములేకాని, దేహమునకు సంబంధించినది కావు.

**మనోనాశనముచేతనే మానవుడు దివ్యత్వమును పొందుతున్నాడు**

మానవుడు 'మనస్సు, మనస్సు' అని కేవలము దేహమునకు సంబంధించినదిగా మనసును భావిస్తున్నాడు. యిది కేవలము సంకల్పవికల్పములతో కూడిన మనస్సు. దీనినే 'సంకల్పవికల్పకాత్మకం మనః' అన్నారు. మనస్సనేది సంకల్పవికల్పములతో కూడినది. కానీ, దేహమునకతీతమైన మనస్సు దివ్యత్వంతో కూడినదే! కనుక, ఈ మనోనాశనము చేతనే మానవుడు దివ్యత్వమును పొందుతున్నాడు. సంకల్పాలకు అతీతమైన మనస్సే ఆత్మయొక్క ప్రతిబింబము. ఈ మూడు ఒక్కటే! ఇది ఏమిటి? వస్త్రము-యిది వస్త్రము కాదు, దారములయొక్క చేరిక-యిది దారముల చేరికకాదు, ప్రత్తి. ప్రత్తి, దారములు, వస్త్రము, ఒక్కటిగానే వుంటున్నాయి. అదే రీతిగా ఆత్మ, మనస్సు, బుద్ధి, మూడింటియొక్క చేరిక ఒక్కటే! యిది అహంకార, మమకార, అభిమానములకు అతీతమైనది. దీనిని 'అహం' అనికూడను చెప్పవచ్చును. 'అహం' అనగా తెలివి. ఈ 'ఆత్మ' అనే తత్త్వంలో 'అహం' అనేది

sri sathyasai vahini amrutam